సాక్షి చిత్తూరు

బుధవారం, 16, జూలై, 2025



కూటమి మోసాలు ఎండగడుదాం

కూటమి ప్రభుత్వ మోసాలను ఎండగడుదామని తిరుపతి, చిత్తూరు జిల్లాల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు భూమన పిలుపునిచ్చారు. - 8లో



భక్తులతో కిక్కిరిసిన బోయకొండ

బోయకొండ గంగమ్మ ఆలయం భక్తులతో కిక్కిరిసింది. తండోపతండాలుగా భక్తులు తరలివచ్చారు. - 8లో



రీకాల్‌చేయొద్దు!

కలెక్టరేట్ ముఖద్వారం వద్ద ఏర్పాటు చేసిన గ్రీవ్స్ ఫిర్యాదుదారులు, ప్రజలను ముప్పతిప్పలు పెడుతోంది. - 8లో

న్యూస్‌రీల్

17 నుంచి ధ్రువపత్రాల పరిశీలన



వరలక్ష్మి, డైట్ ప్రిన్సిపల్

కార్వేటినగరం: జిల్లా విద్యాశిక్షణా సంస్థ (డైట్)లో ఈనెల 17 నుంచి సర్టిఫికెట్ల పరిశీలన ఉంటుందని కళాశాల ప్రిన్సిపల్ వరలక్ష్మి తెలిపారు. మంగళవారం కళాశాల కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. 2025 డీఈఈసెట్ పరీక్ష ఫలితాల్లో అర్హత సాధించిన అభ్యర్థులకు ఈనెల 9 నుంచి 12వ తేదీ వరకు వెబ్ ఆప్షన్స్ సమర్పించేందుకు అవకాశం కల్పించామన్నారు. అలాగే 13 నుంచి 16వ తేదీ వరకు అభ్యర్థులు ఆన్‌లైన్ ద్వారా సీట్ అలాట్‌మెంట్ అవకాశం కల్పించినట్టు వెల్లడించారు. సీట్ అలాట్‌మెంట్ చేసుకున్న అభ్యర్థులకు 17 నుంచి 22వ తేదీ వరకు డైట్ కార్వేటినగరం కళాశాలలో ,సర్టిఫికెట్ల పరిశీలన జరుగుతుందని తెలిపారు. సీట్ అలాట్‌మెంట్ అయిన వారికి ఈనెల 25వ తేదీ నుంచి తరగతులు ప్రారంభమవుతాయని ఆమె పేర్కొన్నారు.

22 నుంచి అడ్వాన్స్డ్ తపాలా 2.0 సేవలు

చిత్తూరు కార్పొరేషన్: అడ్వాన్స్ తపాలా టెక్నాలజీ 2.0తో వినియోగదారులు ఇంటి వద్ద నుంచి సేవలు పొందవచ్చని ఆ శాఖ చిత్తూరు డివిజన్ సూపరింటెండెంట్ లక్ష్మణ తెలిపారు. చిత్తూరు డివిజన్ పరిధిలోని చిత్తూరు, అన్నమయ్య జిల్లాల్లోని 427 తపాలా కార్యాలయాల్లో ఈ విధానం అమలువుతుందన్నారు. నూతన సంస్కరణల్లో భాగంగా ఈ నెల 18 నుంచి 21వ తేదీ వరకు తపాలా కార్యాలయాల్లో సేవల్ని తాత్కాలికంగా నిలిపివేస్తున్నట్లు చెప్పారు. 22వ తేదీ నుంచి తపాలా కార్యాలయాల్లో సేవలు పునఃప్రారంభమవుతాయన్నారు. తపాలా శాఖ డాక్ సేవా యాప్‌ను వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు.

మధ్యవర్తిత్వంతోనే కేసుల పరిష్కారం



మాట్లాడుతున్న న్యాయమూర్తి భారతి

చిత్తూరు లీగల్: న్యాయ స్థానంలో పెండింగ్‌లో ఉన్న కేసులను పరిష్కరించుకోవడానికి మధ్యవర్తిత్వం ఎంతగానో ఉపయోగపడుతుందని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి భారతి తెలిపారు. మంగళవారం చిత్తూరు న్యాయస్థానాల సముదాయంలోని న్యాయసేవా సదన్ భవనంలో బ్యాంకులు, చిట్‌ఫండ్ సంస్థలు, బీమా కంపెనీలకు చెందిన ఉద్యోగులతో మధ్యవర్తిత్వంపై సమావేశం నిర్వహించారు. న్యాయమూర్తి మాట్లాడుతూ ఎలాంటి సమస్యలు వచ్చినా వాటిని పరిష్కరించుకోవడానికి మధ్యవర్తిత్వం కీలకమన్నారు. దీనివల్ల సమయంతో పాటు నగదు కూడా ఆదా అవుతుందన్నారు. ప్రతి ఒక్క సంస్థ మధ్యవర్తిత్వాన్ని ఉపయోగించుకోవాలని, దీనికి న్యాయసేవాధికార సంస్థ తోడ్పాటు అందిస్తుందన్నారు.

అందుబాటులో స్టాంప్ పేపర్లు

చిత్తూరు కార్పొరేషన్: నాన్ జ్యుడీషియల్ స్టాంప్ పేపర్లు అందుబాటులో ఉన్నట్లు జిల్లా రిజిస్ట్రార్ రమణమూర్తి తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ చిత్తూరు ఆర్‌ఓకు రూ.50 పేపర్లు 8వేలు, రూ.100 విలువైనవి 7వేలు, చిత్తూరు రూరల్‌కు రూ.50 పేపర్లు 7వేలు, రూ.100 విలువైనవి 7వేలు, బంగారుపాళ్యం రూ.50వి 2వేలు, రూ.100, 2 వేలు, పలమనేరు రూ.50- 5వేలు, రూ.100 -7వేలు, పుంగనూరు రూ.50- 5వేలు, రూ.100- 6వేలు, కుప్పం రూ.50- 5వేలు, రూ.100 -7వేలు, నగరి రూ.50- 6వేలు, రూ.100 -8 వేలు, కార్వేటినగరం రూ.50- 2వేలు, రూ.100- 4 వేల పేపర్లను ఆయా సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాలకు చేర్చినట్లు వివరించారు. మొత్తం జిల్లాలోని 8 సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల్లో రూ.50 విలువైనవి 40వేలు రూ.100 విలువైనవి 48వేలు నిల్వ ఉన్నట్లు వెల్లడించారు. అలాగే కోర్టు ఫీజు స్టాంపులు 2.72 లక్షలు, ఎస్‌ఎ స్టాంపులు 2.16 లక్షలు, నోటరీ స్టాంపులు 2.24 లక్షలు ఉన్నాయని తెలిపారు.

ఉపాధి కోసం ఉచిత శిక్షణ

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలోని నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించడమే లక్ష్యంగా బ్యూటిఫికేషన్, రీటైల్ కోర్సుల్లో ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు జిల్లా ఉపాధికల్పన అధికారి దొణప్ప తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ పది, ఇంటర్, డిగ్రీ పాస్, ఫెయిల్ అయిన వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఆసక్తిగల అభ్యర్థులు ఈ నెల 17వ తేదీన బయోడేటాతో జిల్లా ఉపాధి కార్యాలయంలో ఉదయం 10.30 గంటలకు నిర్వహించే ఇంటర్వ్యూలకు హాజరు కావాలన్నారు. వివరాలకు 8328677983, 7671066532 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

సీఎస్ఈకి..సై



ఇంజినీరింగ్ అంటేనే సీఎస్ఈ (కంప్యూటర్ సైన్స్ ఇంజినీరింగ్) అనేలా విద్యార్థులు ఎక్కువ మంది ఈ బ్రాంచ్‌పైనే ఆసక్తి చూపుతున్నారు. ఉపాధి, ఉద్యోగ అవకాశాలకు ఢోకా ఉండదని తల్లిదండ్రులు విద్యార్థులను ప్రోత్సహిస్తున్నారు. పేరు పొందిన కంపెనీల్లో జాబ్ కొడితే రూ.లక్షల్లో ప్యాకేజీలు ఉంటాయనే ఆశతో సీఎస్ఈ బ్రాంచ్‌పై అందరి చూపు అటు వైపే నిలుస్తోంది. ఇదే అదునుగా ప్రైవేటు కళాశాలల్లో సీఎస్ఈ కోర్సు డిమాండ్‌ను సొమ్ము చేసుకుంటున్నాయి. మేనేజ్‌మెంట్ సీట్ల పరిమితి లేకపోవడంతో ఇష్టారాజ్యంగా ప్రైవేటు కళాశాలల్లో సీట్లు పెంచుకొని రూ.లక్షల్లో దండుకుంటున్నారు. ఇప్పటికే పేరు పొందిన కళాశాలల్లో మేనేజ్‌మెంట్ కోటాలో సీట్లు హాట్ కేకుల్లా అమ్ముడుపోయాయనే ప్రచారం విద్యార్థుల్లో నడుస్తోంది.

వెబ్ ఆప్షన్లలో ఆ కోర్సువైపు విద్యార్థుల మొగ్గు

- సీఎస్ఈ తరువాత ఏఐ, డేటాసైన్స్, ఎమ్ఎల్, ఎస్ఎస్ కోర్సులకు డిమాండ్
- ఇదే అదునుగా రెచ్చిపోతున్న ప్రైవేటు కళాశాలలు
- ఏడాదికి రూ.3 నుంచి రూ.4 లక్షలు వసూలు చేస్తున్న వైనం
- పేద విద్యార్థులకు దూరంగా సీఎస్ఈలోని అధునాతన కోర్సులు
- మిగిలిన కోర్సులకు వెబ్ ఆప్షన్ పెడితే చాలు సీటు పక్కా



జిల్లాలో ఇంజినీరింగ్ కళాశాలల సమాచారం

ప్రభుత్వ కళాశాలలు	2
డీమ్డ్ వర్శిటీలు	2
అటానమస్ కళాశాలలు	5
ప్రైవేటు కళాశాలలు	11
మొత్తం సీట్ల సంఖ్య	23,080
సీఎస్ఈ బ్రాంచ్‌లోని అన్ని కోర్సుల్లో సీట్ల సంఖ్య	14,530
మిగిలిన సీఎస్ఈ, ఈఈఈ, మెకానికల్, కెమికల్ సీట్ల సంఖ్య	8,550

పేదలకు దూరంగా అధునాతన కోర్సులు

డిమాండ్ ఉన్న కోర్సులుగా వెలుగొందుతున్న సీఎస్ఈ బ్రాంచ్‌లోని ఏఐ, డేటా సైన్స్, ఎమ్ఎల్, ఎస్ఎస్ కోర్సులు పేద విద్యార్థులకు అందనంత దూరంలో నిలిచాయి. ఏపీఈఏమ్ సెట్‌లో సీటు సాధించినా ప్రైవేటు కళాశాలలో సీటు దొరకడం కష్ట తరమవుతోంది. లక్షలలో ఫీజుల చెల్లించలేని పేద విద్యార్థులు ఈఈఈ, మెకానికల్, సివిల్, కెమికల్ ఇంజినీరింగ్ కోర్సుల వైపు మొగ్గు చూపుతున్నారు. సీఎస్ఈ కోర్సు కేవలం ధనవంతుల కోర్సుగా మిగిలిపోయిందని మేధావులు, విద్యావంతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



ఇంజినీరింగ్ క్రేజ్..

ఇప్పుడంతా సీఎస్ఈ బ్రాంచ్ చుట్టూ తిరుగుతోంది. ఉపాధి, ఉద్యోగ అవకాశాలు ఎక్కువగా ఉంటాయనే ప్రచారంతో పాటు పేరొందిన కంపెనీలలో లక్షల ప్యాకేజీలతో మెట్రోపాలిటన్ సిటీలలో ఉద్యోగం లభిస్తుందన్న ఆశతో ఆ గ్రూప్‌నకు డిమాండ్ పెరుగుతోంది. ఇందులో ప్రధానంగా సీఎస్ఈ జనరల్, ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్, డేటా సైన్స్, మెషిన్ లర్నింగ్, సైబర్ సెక్యూరిటీ, బ్లాక్ చైన్ టెక్నాలజీ, క్లౌడ్ టెక్నాలజీ వంటి కోర్సుల హవా కొనసాగుతోంది. జిల్లాలో సుమారు 25 వేల మంది వరకు ఏపీఈఏమ్ సెట్ పరీక్షకు హాజరు కాగా ఇందులో 22,500 మంది అర్హత సాధించారు. ఇందులో ఇప్పటివరకు సుమారు 22 వేల మందికి పైగా విద్యార్థులు సీఎస్ఈ బ్రాంచ్‌లోని పలు కోర్సులకు దరఖాస్తు చేసుకున్నారంటే డిమాండ్ ఏస్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చు.

తిరుపతి సిటీ : జిల్లాలో ఇంజినీరింగ్ అడ్మిషన్ల హడావుడి ప్రారంభమైంది. విద్యార్థులు, తల్లిదండ్రులు ఎవరితో మాట్లాడినా వెబ్ ఆప్షన్ల ఎంపికపైనే పెద్ద ఎత్తున చర్చ జరుగుతోంది. ఏపీ ఈఏఎమ్‌సెట్-2025 వెబ్ ఆప్షన్ల ప్రక్రియ రెండు రోజుల నుంచి ప్రారంభం కావడంతో విద్యార్థులు, తల్లిదండ్రులతో నెట్ సెంటర్లు కళకళలాడుతున్నాయి. సెట్‌లో మంచి ర్యాకులు సాధించిన 90 శాతం మంది విద్యార్థులు సీఎస్ఈ గ్రూప్‌నే తమ వెబ్ ఆప్షన్లలో తొలి ప్రాధాన్యం ఇస్తున్నారు. రెండవ ప్రాధాన్యంగా ఈసీఈ కోర్సును ఎంచుకుంటున్నారు. అయితే ఒకప్పుడు తిరుగులేని గ్రూపులుగా వెలుగొందిన ఈఈఈ, మెకానికల్, సివిల్, కెమికల్ ఇంజినీరింగ్ కోర్సులపై కనీసం 10 శాతం మంది కూడా తొలి ప్రాధాన్యం ఇవ్వకపోవడం గమనార్హం. దీంతో ఈ ఏడాది జిల్లాలో అర్హత సాధించిన ప్రతి విద్యార్థికి ఈఈఈ, మెకానికల్, సివిల్, కెమికల్ ఇంజినీరింగ్ బ్రాంచ్‌లలో కన్వీనర్ కోటాలో ఏదో ఒక కళాశాలలో సీటు పక్కా వచ్చేందుకు వీలుంటుందని నిపుణులు అంచనా వేస్తున్నారు.

ప్రైవేటు కళాశాలలు సొమ్ము చేసుకుంటూ..

సీఎస్ఈ కోర్సుకు ప్రస్తుతం ఉన్న డిమాండ్‌ను ప్రైవేటు విద్యా సంస్థల యాజమాన్యాలు ఇదే అదనుగా రెచ్చిపోతూ ఫీజులు పెంచి సొమ్ము చేసుకుంటున్నాయి. అన్ని ప్రైవేటు, కార్పొరేట్, డీమ్డ్, అటానమస్ విద్యా సంస్థలలో సీఎస్ఈ కన్వీనర్ కోటా సీట్లు తప్ప మేనేజ్‌మెంట్, పేమెంట్ సీట్లను పూర్తి స్థాయిలో ఇప్పటికే అమ్ముడు పోయాయి. ఏఐసీటీఈ గత ఏడాది సీట్ల పరిమితిపై ఉన్న సీలింగ్‌ను ఎత్తి వేయడంతో ప్రైవేటు యాజమాన్యాలు ఇష్టారాజ్యంగా తమ కళాశాలలో డిమాండ్ ఉన్న కోర్సులకు సీట్లు పెంచుకుంటున్నాయి. కళాశాల స్థాయి, పేరు ప్రతిష్టల ఆధారంగా యాజమాన్యాలు ఒక్కో కోర్సుకు ఏడాదికి సుమారు. రూ. 3 లక్షల నుంచి రూ.5 లక్షల వరకు విద్యార్థుల నుంచి వసూలు చేసి కేవలం రూ.70 వేలకు రసీదులు ఇచ్చి పంపుతున్నారు. తిరిగి మాట్లాడితే విద్యార్థికి సీటు లేదంటూ వెనక్కి పంపుతారనే భయంతో తల్లిదండ్రులు ఏమీ చేయలేని స్థితిలో వారు అడిగినంతా ఫీజు చెల్లించి వెనుదిరుగుతున్నారు. ప్రైవేటు యాజమాన్యాల దౌర్జన్యాన్ని ప్రత్యక్షంగా చూస్తున్న ఉన్నత విద్యామండలి అధికారులు ఏమీ చేయలేమని చేతులెత్తి కూర్చోవడం గమనార్హం.

ఏఐ కోర్సు చేయాలని..



ఇంజినీరింగ్ వెబ్ ఆప్షన్లలో సీఎస్ఈ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌కు ప్రథమ ప్రాధాన్యం ఇచ్చాను. ఏఐకి క్రేజ్‌తో పాటు భవిష్యత్తు ఉంది. కష్టపడి చదివితే మంచి ప్యాకేజీతో ఉన్నత స్థాయి ఉద్యోగం వస్తుందనే నమ్మకం ఉంది. ఏఐ కోర్సుకు ఎస్వీయూ పరిధిలో పేరొందిన కళాశాలలకు తొలి ప్రాధాన్యతగా పెట్టుకున్నా.

–ప్రవల్లిక, విద్యార్థిని, తిరుపతి

డేటా సైన్స్, ఏఐ ఆప్షన్లు పెట్టాను



ఏపీఈఏఎమ్‌సెట్‌లో మంచి ర్యాంక్ వచ్చింది. డేటా సైన్స్ లేదా ఏఐ చేయాలని ఉంది. ఈ క్రమంలో తొలి ప్రాధాన్యం డేటా సైన్స్, రెండో ప్రాధాన్యం ఏఐకి ఇచ్చాను. కచ్చితంగా నేను అనుకున్న కళాశాలలో సీటు వస్తుందని ఆశిస్తున్నా. ఫారిన్‌లో ఎమ్ఎస్ చేయాలని ఉంది.

– పృథ్వీ, విద్యార్థి, తిరుపతి

సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ కావాలని..



సాఫ్ట్ వేర్ రంగంలో రాణించాలనేది నా చిన్ననాటి కోరిక. ఏపీఈఏఎమ్‌సెట్‌లో 3 వేల లోపు ర్యాంక్ సాధించా. కచ్చితంగా పేరొందిన కళాశాలలో సీఎస్ఈ జనరల్ సీటు వస్తుందని ఆశిస్తున్నా. ఇప్పటికే వెబ్ ఆప్షన్ తొలి ప్రాధాన్యతగా సీఎస్ఈ జనరల్, రెండో ప్రాధాన్యతగా ఈఎసీఈకి ఇచ్చా.

– రజిని, విద్యార్థిని, తిరుపతి

హరీష్‌కు ప్రతిష్టాత్మక అవార్డు



చిత్తూరు కలెక్టరేట్ : ఇంటర్నేషనల్ కౌన్సిల్ ఫర్ ఎడ్యుకేషన్ రీసెర్చ్ అండ్ ట్రెనింగ్ (ఐసీఆర్‌టీ) ప్రతిష్టాత్మకంగా ఇచ్చే యూత్ ఎంపవర్‌మెంట్ అవార్డుకు ఎంబీఏ విద్యార్థి హరీష్ బాబు ఎంపికయ్యారు. మంగళవారం ఈ మేరకు ఐసీఈఆర్‌టీ ఈడీ సిమ్రాన్ మెహతా ప్రకటించారు. హరీష్ చిత్తూరులోని విజయం ఎంబీఏ కళాశాలలో మొదటి సంవత్సరం చదువుతున్నారు. వరల్డ్ యూత్ స్కిల్స్ డే రోజున నిర్వహించే కార్యక్రమంలో హరీష్ ఈ అవార్డును అందుకోనున్నారు. ఈ సందర్భంగా విద్యార్థిని కళాశాల చైర్మన్ తేజోమూర్తి, డైరెక్టర్ శైలజా, ఐరాల మండలం 45 కొత్తపల్లి సర్పంచ్ బాలాజీ అభినందించారు.

నేడు విద్యుత్ గ్రీవెన్స్

చిత్తూరు కార్పొరేషన్ : వినియోగదారుల సమస్యల పరిష్కారం కోసం బుధవారం విద్యుత్ గ్రీవెన్స్ నిర్వహించనున్నారు. ఉదయం 10.30 గంటలకు కార్యక్రమం ప్రారంభమవుతుందని ట్రాన్స్‌కో ఈఈ మునిచంద్ర తెలిపారు. స్థానిక గాంధీరోడ్డులోని ఈఈ కార్యాలయంలో చిత్తూరు, పూతలపట్టు నియోజకవర్గాల పరిధిలోని వినియోగదారులు తమ సమస్యలను అర్జీల రూపంలో అందించాలని సూచించారు.

బాధ్యతగా పనిచేయండి

చిత్తూరు కలెక్టరేట్ : నగరకపాలక, మున్సిపల్ కార్యాలయాల్లోని టౌన్ ప్లానింగ్ అధికారులు బాధ్యతగా పనిచేయాలని కలెక్టర్ సుమిత్‌కుమార్‌గాంధీ ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లో పలు శాఖల అధికారులతో వరుస సమీక్షలు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మున్సిపల్ కమిషనర్లు ప్రతి రోజూ ఉదయం శానిటేషన్ ప్రక్రియ పై ప్రత్యేక దృష్టి వహించాలన్నారు.

సంఘాల అభివృద్ధికి చర్యలు

జిల్లాలోని స్వయం సహాయక సంఘాల అభివృద్ధికి చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు. డీఆర్‌డీఏ అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. డీఆర్‌డీఏ పీడీ శ్రీదేవి, డీపీఎం, ఏపీఎంలు పాల్గొన్నారు.

నాణ్యతగా ఉండాలి



కార్మికులతో మాట్లాడుతున్న ఈడీ

చిత్తూరు రూరల్ (కాణిపాకం): బస్సుల రిపేర్లలో నాణ్యతాప్రమాణాలు పాటించాలని ఏపీఎస్‌ఆర్టీసీ కడప జోన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్(ఈడీ) చంద్రశేఖర్ అధికారులను ఆదేశించారు. మంగళవారం చిత్తూరు ఆర్టీసీ 1, 2 డిపోలను ఆయన పరిశీలించారు. అనంతరం డీపీటీవో రాము, డీఎంలతో సమావేశమయ్యారు. ఆయన మాట్లాడుతూ అవసరాలకు తగ్గట్టుగా బస్సుల శాతాన్ని పెంచాలన్నారు. రానున్న కాలంలో బస్సుల్లో ప్రయాణికుల తాకిడి అధికంగా ఉంటుందన్నారు. హ్యాంగింగ్ రాడ్లను బలమైనవిగా అమర్చాలని ఆయన సూచించారు. అనంతరం గ్యారేజ్‌ను తనిఖీ చేశారు. ఉద్యోగ సంఘాల నాయకులతో సమావేశమై పలు సూచనలు చేశారు. డిపో మేనేజర్ క్రిష్ణమూర్తి, సీఐ అల్తాఫ్ పాల్గొన్నారు.

కొబ్బరి.. డిమాండే మరి!

చెట్టెక్కిన కొబ్బరి బొండాల ధర

- తోటల వద్ద కాయ రూ.25
- హోల్‌సేల్ వారికి రూ.30
- రిటైల్‌లో కాయ ధర రూ.40
- మామిడికి ప్రత్యామ్నాయంగా కొబ్బరితోటలే మేలంటున్న ఉద్యానశాఖ



పలమనేరు నుంచి ఢిల్లీకి వెళుతున్న కొబ్బరి బొండాలు

పలమనేరు: సాధారణంగా వేసవిలో కొబ్బరి బొండాలకు డిమాండ్ ఉంటుంది. కానీ అన్ సీజన్‌లోనూ కొబ్బరి బొండాల ధర పెరుగుతూనే వస్తోంది. ఇదే సమయంలో మామిడి కాయలను కొనేవారు లేక రోడ్డుపాలవుతున్నాయి. ఈ నేపథ్యంలో మామిడి తోటలున్న రైతులు ప్రత్యామ్నాయంగా కొబ్బరి తోటలను సాగుచేయడం మేలని ఉద్యానశాఖ అధికారులు చెబుతున్నారు.

ఒక్కో కొబ్బరి బొండాం రూ.45

పలమనేరు రెవెన్యూ డివిజన్‌లో కొబ్బరితోటలు ఎక్కువగా ఉన్నాయి. వ్యవసాయ పొలం గట్లలో వీటిని పెంచడం ఇక్కడి ఆనవాయితీ. కొందరు రైతులు మాత్రం కొబ్బరి తోటలను పెంచారు. ఇప్పుడు నెలకొన్న డిమాండ్ కారణంగా స్థానిక వ్యాపారులు రైతుల వద్ద ఓ కొబ్బరిబొండాన్ని రూ.25 దాకా కొంటున్నారు. వీటిని సేకరించి బయటి వ్యాపారులకు రూ.30 దాకా అమ్ముతున్నారు. ఈ ప్రాంతం నుంచి ఎక్కువగా బొండాలు మహారాష్ట్ర, ఉత్తర్‌ప్రదేశ్, ఢిల్లీ, బిహార్, రాష్ట్రంలోని కడప, శ్రీకాళహస్తి, నాయుడుపేట, సూళ్లూరు పేటకు ఎగుమతి చేస్తున్నారు. అక్కడి హోల్‌సేల్ వ్యాపారుల నుంచి రిటైల్ వ్యాపారులు రూ.35తో కొంటున్నారు. రిటైల్ మార్కెట్‌లో కాయ రూ.45గా విక్రయిస్తున్నారు. అదే లీటర్ కొబ్బరినీళ్లు రూ.120 దాకా విక్రయిస్తున్నారు.

మామిడికి బదులు కొబ్బరి తోటలే మేలు

జిల్లాలో తోతాపురి మామిడి ఏటా నష్టాలు చేకూర్చుతోంది. గత పదేళ్లలో ఎన్నడూ లేని విధంగా ఈ దఫా మామిడి రైతులు కాయలు అమ్ముకోలేని దుస్థితి నెలకొంది. దీంతో పంట పెట్టుబడిమాట దేవుడెరుగు కనీసం కూలి కూడా దక్కలేదు. ఈ నేపథ్యంలో చాలామంది రైతులు మామిడి తోటలను కోసేస్తున్నారు. ప్రత్యామ్నాయంగా కొబ్బరి తోటలు సాగుపై దృష్టి సారిస్తున్నారు. దీనిపై జిల్లా ఉద్యానశాఖ దృష్టి సారించి ప్రత్యామ్నాయ పంటలపై రైతులకు అవగాహన కల్పించాల్సి ఉంది.



పలమనేరు ప్రాంతంలోని కొబ్బరి తోటలు

అవగాహన కల్పిస్తున్నాం



ఏటా మామిడి సీజన్‌లో తోతాపురికి గిట్టుబాటు ధర లేక రైతులు ఇబ్బందులు పడుతున్నారు. మామిడికి ప్రత్యామ్నాయంగా ఇతర పంటలపై దృష్టి సారించాలని గత రెండేళ్లుగా క్షేత్ర స్థాయిలో రైతులకు అవగాహన కల్పిస్తున్నాం. మామిడికి బదులు కొబ్బరి కూడా మంచిదే.

– మధుసూదన్‌రెడ్డి, జిల్లా ఉద్యాన అధికారి, చిత్తూరు

భారీగా నష్టాలు రావు



నేను పదేళ్లుగా కొబ్బరిబొండాల వ్యాపారం చేస్తున్నా. ఇందులో రైతులకు మేలు, నష్టం బాగా తెలుసు. మామిడితోటలకు లాగా వీటికి క్రిమి సంహారక మందులు పిచికారీ చేయనవసరం లేదు. అందుకే ఇక్కడి కొబ్బరి బొండాలకు దేశంలోని పలు రాష్ట్రాల్లో మంచి గిరాకీ ఉంటుంది. లాభాలే తప్ప నష్టాలుండవు.

– ఖాదర్‌బాషా, కొబ్బరిబొండాల వ్యాపారి, బైరెడ్డిపల్లి

ప్రత్యామ్నాయం చూసుకుంటా



నేను మూడు దశాబ్దాలుగా మామిడి తోటలను సాగుచేస్తున్నా. ఈ దఫా మామిడి పరిస్థితి చూసి ఇక లాభం లేదనుకున్నా. అందుకనే మామిడికి బదులు ప్రత్యామ్నాయంగా వేరే పంట సాగు చేయాలని అనుకుంటున్నా. ఉద్యానశాఖ సూచనలు తీసుకొని గ్యారెంటీ గిట్టుబాటుంటే పంటలను సాగుచేస్తా.

– సుబ్రమణ్యం నాయుడు, రైతు, రామాపురం

పెరిగిన ధరలు

కర్ణాటక రాష్ట్రంలోని మైసూరు వద్ద మద్దూరు కోకొనెట్ మార్కెట్ ఆసియాలోనే పెద్దది. ఇక్కడికి కావేరి నదీ పరివాహక ప్రాంతం నుంచి నాణ్యమైన కొబ్బరి బొండాలు వస్తుంటాయి. అక్కడి నుంచి దేశ విదేశాలకు బొండాల ఎగుమతులు సాగుతుంటాయి. అలాంటి మార్కెట్లోనే ఇప్పుడు డిమాండ్‌కు సరిపడా సరుకు లేదని వ్యాపారులు చెబుతున్నారు. దీంతో స్థానికంగా ఉన్న కొబ్బరి బొండాలకు డిమాండ్ పెరిగి ధరలు ఆకాశాన్నంటుతున్నాయి.



కొబ్బరి బొండాలు

క్లుప్తంగా

రూ.3.50 కోట్లకు ఐపీ

చిత్తూరు అర్బన్: చిత్తూరులో ఓ వ్యాపారి రూ.3.5 కోట్లకు ఐపీ (దివాళాదారు పిటిషన్) దాఖలు చేశాడు. దీన్ని న్యాయస్థానం విచారణకు స్వీకరించింది. చిత్తూరు నగరంలోని న్యూ బాలాజీ కాలనీకి చెందిన ఓఎం.నందకుమార్ (50) నగరంలో పలు వ్యాపారాలు చేశాడు. ఇందుకోసం చిత్తూరుకు చెందిన 105 మంది నుంచి రూ.3.5 కోట్ల వరకు అప్పు చేశాడు. వ్యాపారంలో నష్టాలు రావడంతో తనను దివాళాదారుడిగా ప్రకటించాలని చిత్తూరు సివిల్ కోర్టులో పిటిషన్ దాఖలు చేశాడు. దీన్ని విచారణకు స్వీకరించిన న్యాయస్థానం.. ప్రతివాదులకు నోటీసులు జారీచేసింది.

యువకుడి ఆత్మహత్య

పుంగనూరు: మండలంలోని జౌకొత్తూరుకు చెందిన కార్తీక్(26) పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మంగళవారం పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. కార్తీక్ బెంగళూరులో నివాసం ఉంటూ వ్యాపారాల్లో అప్పులపాలయ్యాడు. అక్కడ వారి వేధింపులు తాళలేక స్వగ్రామమైన జౌకొత్తూరుకు వచ్చి మూడు రోజుల క్రితం పురుగుల మందు తాగి పడిపోయాడు. బంధువులు ఆ యువకుడిని బెంగళూరులోని ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, మృతదేహాన్ని పోస్టుమార్టానికి తరలించి దర్యాప్తు చేపట్టారు.

ఎమ్మెల్యే చెబితే బస్సులు ఆపాలా?

గుడిపాల: చిత్తూరు 1-డిపో, 2- డిపోకు సంబంధించిన ఆర్టీసీ బస్సులు గుడిపాల మండలంలోని నరహరిపేటలో స్టాపింగ్ పాయింట్ వద్ద ఆపడం లేదు. గతంలో ఎమ్మెల్యే గురజాల జగన్‌మోహన్ చెప్పినా కూడా అతని ఆదేశాలను ఎవ్వరూ లెక్క చేయడం లేదు. 'ఎమ్మెల్యే చెబితే మేం బస్సులు ఆపాలా..?' మాకు టైం ఉంటే ఆపుతాం లేకుంటే వెళ్తాం.' అంటూ ఆర్టీసీ సిబ్బంది తెగేసి చెబుతున్నారు. ఇవేమైనా ఆర్డినరీ బస్సులా అంటూ ప్రశ్నిస్తున్నారు. 'ఆర్డినరీ బస్సులుగా చేయమనండి అప్పుడు ఆపడమే కాకుండా మాకూ ఓ సింగిల్ తగ్గుతుంది. ప్రతి ఒక్కరూ చేయి ఆపితే ఆపాలని మాకు రూల్స్ లేవు' అంటూ ఖరాకండీగా చెబుతున్నారు. గతంలోనే నరహరిపేట వద్ద పోలీస్‌స్టేషన్, చెక్‌పోస్ట్, టీటీడీ కల్యాణ మండపంతో పాటు సుమారు 50 గ్రామాల ప్రజలు వెళ్లేందుకు వీలుగా చిత్తూరు ఆర్టీసీ రీజినల్ మేనేజర్‌కు ప్రజలు అర్జీని అందజేశారు. ఆయన ఆదేశాల మేరకు డిపో మేనేజర్లు కచ్చితంగా నరహరిపేటలో బస్సులను ఆపాలని ఆదేశాలు జారీచేశారు. వారి ఆదేశాలను మాత్రం కింది స్థాయి సిబ్బంది ఎవ్వరూ పాటించడం లేదు.

శిశుమరణాలపై తక్షణ చర్యలు

చిత్తూరు రూరల్ (కాణిపాకం): శిశు మరణాలపై తక్షణ చర్యలు చేపట్టాలని డీఎంఅండ్‌హెచ్ఓ సుధారాణి వైద్యాధికారులను ఆదేశించారు. మంగళవారం చిత్తూరులోని తన కార్యాలయంలో జిల్లాలో జూన్‌లో జరిగిన నాలుగు శిశు మరణాలపై టాస్క్‌ఫోర్స్ కమిటీతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ కాన్పు జరిగినప్పుడు వ్యాధి నిరోధక టీకాలు సకాలంలో వేయించాలన్నారు.

కూటమి మోసాలు ఎండగడుదాం



బాబూ ష్యూరిటీ- మోసం గ్యారెంటీ క్యూఆర్ కోడ్‌ను ఆవిష్కరిస్తున్న పార్టీ శ్రేణులు



సమావేశానికి హాజరైన పార్టీ నాయకులు, కార్యకర్తలు

- కలసికట్టుగా శ్రమిద్దాం
- పూతలపట్టు నియోజకవర్గం నుంచే ఉద్యమం చేపడుదాం
- బాబు ష్యూరిటీ- మోసం గ్యారెంటీ క్యూఆర్‌కోడ్ ఆవిష్కరణలో వైఎస్సార్‌సీపీ శ్రేణులకు చిత్తూరు, తిరుపతి జిల్లాల అధ్యక్షుడు భూమన పిలుపు

తవణంపల్లె: చంద్రబాబు, పవన్‌ల మోసపూరిత వాగ్దాలను ప్రజల్లోకి తీసుకెళ్లి ఎండగట్టాలని, అందుకు వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు కలసికట్టుగా పనిచేయాలని చిత్తూరు, తిరుపతి జిల్లాల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు భూమన కరుణాకరరెడ్డి పిలుపు నిచ్చారు. మంగళవారం మండలంలోని కాణిపాకం రోడ్డులో నారాయణాద్రి కల్యాణ మండపంలో బాబు షూరిటీ–మోసం గ్యారెంటీలో భాగంగా వైఎస్సార్‌సీపీ పూతలపట్టు నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ సునీల్‌కుమార్ అధ్యక్షతన మండల స్థాయి సమావేశాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేసి ప్రసంగించారు. ఎన్నికల ముందు కూటమి నేతలు ఇచ్చిన మోసపూరిత హామీలను, వైఎస్సార్‌సీపీ పాలనలో జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన సంక్షేమ, అభివృద్ధి పథకాల వ్యత్యాసాన్ని ప్రజలకు తెలియజేయాలన్నారు. ఎన్నికల సందర్భంగా కూటమి ప్రభుత్వం ఇచ్చిన 143 హామీలు, సూపర్ సిక్స్‌ను అమలు చేయకుండానే బుకాయిస్తోందని ఎద్దేవా చేశారు. వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి బంగారుపాళ్యం పర్యటనతో కూటమి నాయకుల్లో వణుకు పుట్టిందన్నారు.

మోసం..బాబు నైజం

పూతలపట్టు నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ సునీల్‌కుమార్ మాట్లాడుతూ జగన్‌మోహన్‌రెడ్డి పర్యటనను విజయవంతం చేసిన నియోజకవర్గ పార్టీ నాయకులు, కార్యకర్తలకు రుణపడి ఉంటామన్నారు. బాబు షూరిటీ- మోసం గ్యారంటీ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. మాజీ ఎంపీ రెడ్డెప్ప మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, సోషల్ మీడియా ప్రతినిధులను తీవ్రంగా హింసిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మాజీ ఎమ్మెల్యే లలితకుమారి మాట్లాడుతూ ప్రజలను మోసగించడం చంద్రబాబు నైజమని దుయ్యబట్టారు. కూటమి ప్రభుత్వంపై ప్రజలు తిరుగుబాటుకు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. చిత్తూరు పార్లమెంట్ నియోజకవర్గ పరిశీలకులు రాజశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ చంద్రబాబు, పవన్ ఇచ్చిన వాగ్దానాలను ఏడాదిలో అమలు చేయకపోవడం వల్ల ప్రజలు ఎంతో నష్టపోయారన్నారు. అనంతరం బాబూ ష్యూరిటీ- మోసం గ్యారెంటీ క్యూఆర్ కోడ్‌ను ఆవిష్కరించారు. తవణంపల్లె, బంగారుపాళ్యం, ఐరాల, పూతలపట్టు, యాదమరి మండలాల పార్టీ అధ్యక్షులు హరిరెడ్డి, రామచంద్రారెడ్డి, బుజ్జిరెడ్డి, జయచంద్రారెడ్డి, ధనంజయరెడ్డి, పార్టీ నాయకులు తలపులపల్లె బాబురెడ్డి, కుమార్‌రాజ, మోహన్‌రెడ్డి, శిరీష్‌రెడ్డి, కిషోర్‌కుమార్‌రెడ్డి, గజేంద్ర, ప్రకాష్‌బాబురెడ్డి, సుకేష్‌రెడ్డి, తేజారెడ్డి, కుమార్, గౌహతిసుబ్బారెడ్డి, సుగుణశేఖర్ రెడ్డి, రాజారత్నంరెడ్డి, సుధాకర్ రెడ్డి, దూర్వాసులురెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, రమణారెడ్డి, కిషోర్‌రెడ్డి, సతీష్‌రెడ్డి, శరత్‌రెడ్డి, మధుకుమార్, చిన్నారెడ్డి, మురుగన్, మణిరాజ్, పరదేశి, ప్రసాద్ పాల్గొన్నారు.

గర్భవతిని రైలు నుంచి కిందికి తోసిన యువకుడికి జీవిత ఖైదు

- బాధిత కుటుంబానికి రూ. కోటి నష్ట పరిహారం చెల్లించాలని కోర్టు తీర్పు



ముద్దాయి హేమరాజ్

వేలూరు: తిరుపత్తూరు జిల్లా జోలార్‌పేట సమీపంలోని రైలులో గర్భవతిపై అత్యాచారానికి యత్నించి రైలు నుంచి కిందకు తోసి వేసిన యువకుడికి జీవిత శిక్ష విధించడంతో పాటూ బాధిత కుటుంబానికి రూ. కోటి పరిహారం చెల్లించాలని తిరుపత్తూరు కోర్టు తీర్పునిచ్చింది. వివరాలు.. ఆంధ్ర రాష్ట్రం చిత్తూరు జిల్లాకు చెందిన నాలుగు నెలల గర్భవతి ఈ ఏడాది ఫిబ్రవరి 7వ తేదిన తిరుప్పూరు నుంచి తిరుపతి ఇంటర్‌సిటీ ఎక్స్‌ప్రెస్ రైలులో బయలుదేరింది. ఆ సమయంలో వేలూరు జిల్లా కేవీ కుప్పం గ్రామానికి చెందిన హేమరాజ్ అదే రైలులో వస్తూ గర్భవతిని లైంగికంగా వేధించాడు. బాధితురాలు కేకలు వేయడంతో రైలు నుంచి కిందకు తోసి వేసిన విషయం తెలిసిందే. ఈ ప్రమాదంలో ఆమెకు కాళ్లు, చేతులు విరగడంతో పాటూ ముఖం పూర్తిగా దెబ్బతినడంతో ఆమెను చికిత్స నిమిత్తం వేలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించి చికిత్స అందజేశారు. అనంతరం కేవీ కుప్పంకు చెందిన హేమరాజ్‌ను పోలీసులు అరెస్ట్ చేసి వేలూరు సెంట్రల్ జైలులో ఉంచారు. ఈ కేసు విచారణ తిరుపత్తూరు కోర్టులో జరుగుతుంది. తుది తీర్పు సోమవారం సాయంత్రం న్యాయమూర్తి మైనా కుమారి ముందుకు వచ్చింది. నిందితుడు హేమరాజ్‌కు జీవిత శిక్ష విధించడంతో పాటూ రాష్ట్ర ప్రభుత్వం రూ. 50 లక్షలు, రైల్వే శాఖ రూ. 50 లక్షలు చొప్పున మొత్తం రూ. కోటి బాధిత కుటుంబానికి అందజేయాలని న్యాయమూర్తి తీర్పిచ్చారు.

కోడలు అరెస్ట్

సాక్షి ఎఫెక్ట్..



మామ మృతికి కారణమైన కోడలిని అరెస్ట్ చూపుతున్న పోలీసులు

చౌడేపల్లె: మామపై అతికర్కశంగా దాడిచేసి తీవ్రంగా గాయపరిచి మృతికి కారుకురాలైన కోడలు సరస్వతమ్మను అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ నాగేశ్వరరావు మంగళవారం తెలిపారు. ఆయన కథనం.. చౌడేపల్లె మండలం, అంకుతోటపల్లెకు చెందిన చిన్నప్పరెడ్డి, రాజమ్మపై కుమారుడు మనోహర్‌రెడ్డి ఆస్తి విషయంపై నిత్యం ఘర్షణ పడేవాడు. ఈ క్రమంలో మార్చి 30వ తేదీ ఇంట్లో ఉన్న తండ్రి చిన్నప్పరెడ్డితో ఘర్షణపడ్డాడు. ఈ క్రమంలో తండ్రి కాలు విరిగిపోగా స్థానిక గ్రామస్తులు మదనపల్లె ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఈ విషయమై మార్చి 31న 'సాక్షి'లో 'కడుపున పుట్టినోళ్లా... తోడేళ్లా' శీర్షికన వార్త వెలువడింది. దీనిపై స్పందించిన జిల్లా ఎస్పీ మణికంఠ చందోలు ఆదేశాల మేరకు ఎస్ఐ కేసు నమోదు చేశారు. ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొంది శస్త్ర చికిత్స అనంతరం చిన్నప్పరెడ్డిను స్వగ్రామాని తెచ్చారు. మనోవేదనకు గురైన అతను ఏప్రిల్ 21వ తేదీ మృతిచెందాడు. చిన్నప్పరెడ్డి మృతికి కారణమైన కుమారుడు మనోహర్‌రెడ్డి, కోడలు సరస్వతమ్మపై కేసు నమోదు చేశారు. పరారీలో ఉన్న మనోహర్‌రెడ్డిని గత నెల 16న అరెస్ట్ చేయగా.. సరస్వతమ్మను మంగళవారం అదుపులోకి తీసుకుని పుంగనూరు కోర్టులో హాజరుపరిచారు. న్యాయమూర్తి వారికి రిమాండ్ విధించారు.

డ్రంక్ అండ్ డ్రైవ్‌లో 22 మందికి జరిమానా

చిత్తూరు అర్బన్: మద్యం తాగి వాహనాలు నడిపిన 22 మందికి రూ.2.2 లక్షల జరిమానా విధిస్తూ చిత్తూరులోని ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ఉమాదేవి మంగళవారం తీర్పునిచ్చారు. చిత్తూరు ట్రాఫిక్ సీఐ నిత్యబాబు గత రెండు రోజులుగా వాహనాలు తనిఖీ చేస్తుండగా పలువురు మద్యం సేవించి వాహనాలు నడుపుతున్నట్లు గుర్తించారు. మొత్తం 22 మందిపై కేసు నమోదు చేసి, కోర్టుకు తరలించారు. ఒక్కొక్కరికీ రూ.10 వేల చొప్పున మొత్తం రూ.2.2 లక్షల జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పునిచ్చారు.

భక్తులతో కిక్కిరిసిన బోయకొండ



ప్రత్యేక అలంకారంలో అమ్మవారు

చౌడేపల్లె : బోయకొండ గంగమ్మ ఆలయం భక్తులతో మంగళవారం కిక్కిరిసింది. ఏపీతో పాటు కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల నుంచి వేలాది మంది పోటెత్తారు. ఈ సందర్భంగా అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. మహిళలు పిండి, నూనె దీపాలు వెలిగించి మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ ఈఓ ఏకాంబరం ఆధ్వర్యంలో సిబ్బంది ఉచిత ప్రసాదాలు పంపిణీ చేశారు.

యువతిపై అడవి పంది దాడి



మీనాక్షి కాలికి గాయమైన దృశ్యం

కుప్పం రూరల్ : మండలంలోని వి.మిట్టపల్లెలో మంగళవారం ఉదయం అడవి పంది దాడిలో ఓ యువతి గాయపడింది. వివరాలు.. గ్రామానికి చెందిన దండపాణి కుమార్తె మీనాక్షి పశువులకు గడ్డి తెచ్చేందుకు పొలానికి వెళ్లింది. ఇంతలో కుక్కలు తరమడంతో అటు వైపు వచ్చిన అడవి పంది దాడి చేసి మీనాక్షి కాలిని గట్టిగా కరిచేసింది. యువతి భయంతో కేకలు వేయడంతో సమీపంలోని కుటుంబీకులు హుటాహుటి వచ్చి పందిని తరిమేశారు. గాయపడిన మీనాక్షిని కుప్పం ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు గ్రామస్తులు మాట్లాడుతూ అడవి పందుల కారణంగా పంటలు నాశనమవుతున్నాయని, పలువురు గాయపడుతున్నారని తెలిపారు. అటవీ అధికారులు స్పందించి అడవి పందులు గ్రామాల్లోకి ప్రవేశించకుండా చర్యలు చేపట్టాలని కోరారు.

ఉరి వేసుకుని వ్యక్తి ఆత్మహత్య



మృతి చెందిన సుబ్రమణ్యం

వి.కోట: భార్యతో గొడవపడి మనస్తాపంతో మామిడి చెట్టుకు ఉరి వేసుకుని వ్యక్తి మృతి చెందిన ఘటన మండలంలో మంగళవారం చోటుచేసుకుంది. పోలీసుల వివరాల మేరకు .. మండలంలోని యాలకల్లు పంచాయతీ, కపట్లబండకు చెందిన వెంకటరమణప్ప కుమారుడు సుబ్రమణ్యం(37) తన భార్యపిల్లలతో కలిసి మండలంలోని గెస్తింపల్లి సమీపంలోని ప్రజాష్‌స్వామికి చెందిన మామిడి తోటలో కొంతకాలంగా కాపలాగా ఉంటున్నాడు. ఈ క్రమంలో సోమవారం రాత్రి భార్యభర్తలిద్దరూ గొడవపడ్డాడు. మంగళవారం ఉదయం భార్య తోట నుంచి బయటకు వెళ్లగానే సుబ్రమణ్యం అదే తోటలో మామిడి చెట్టుకు ఉరి వేసుకుని మృతి చెందాడు. పోలీసు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పలమనేరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

పెన్షనర్లపై చిన్నచూపు తగదు



డిమాండ్లు పరిష్కరించాలంటూ కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహిస్తున్న పెన్షనర్లు

చిత్తూరు కలెక్టరేట్ : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పెన్షనర్ల పట్ల చిన్నచూపు చూడడం సరికాదని రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు నాగరాజ తెలిపారు. ఈ మేరకు ఆ అసోసియేషన్ నాయకులు మంగళవారం కలెక్టరేట్ ఎదుట డిమాండ్ల పరిష్కారానికి ధర్నా నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కేంద్రం ప్రవేశపెట్టిన వ్యాలిడేషన్ అమెండ్‌మెంట్‌ను వెంటనే రద్దు చేయాలన్నారు. పీఎఫ్ఆర్‌డీఏ చట్టం వల్ల పెన్షనర్లకు తీవ్ర నష్టం కలుగుతోందన్నారు. ఆ చట్టాన్ని రద్దు చేయాలని డిమాండ్‌చేశారు. ఎన్‌పీఎస్, యూపీఎస్ విధానాలను నిలిపివేయాలన్నారు. కూటమి ప్రభుత్వం వెంటనే పే కమిషన్‌ను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని కలెక్టరేట్ అధికారులకు అందజేశారు. ఈ ధర్నాలో నాయకులు మురుగానందం, మురళి, ప్రభాకర్‌నాయుడు, శివకుమార్, దశరథనాయుడు, పలమనేరు, బంగారుపాళ్యం నుంచి పెన్షనర్లు పాల్గొన్నారు.

ఎరువుల దుకాణాలపై దాడులు



పలమనేరులోని ఎరువుల దుకాణాల్లో తనిఖీలు నిర్వహిస్తున్న విజిలెన్స్ అధికారులు

పలమనేరు: పట్టణంలోని పలు క్రిమిసంహారక మందులు, ఎరువుల దుకాణాలపై విజిలెన్స్, స్థానిక వ్యవసాయశాఖ అధికారులు మంగళవారం దాడులు నిర్వహించారు. ఇక్కడి దుకాణాల్లో 892 బస్తాల యూరియా నిల్వలు ఉన్నట్టు గుర్తించారు. వీటిని ప్రభుత్వం నిర్ణయించిన ధరకే విక్రయించాలని సూచించారు. ఈ సందర్భంగా దుకాణాల్లోని స్టాకు వివరాలు, బిల్లు బుక్కులను తనిఖీ చేశారు. రైతులు కొన్న ఎరువులు, క్రిమిసంహారక మందులకు కచ్చితంగా బిల్లులు ఇవ్వాలని ఆదేశించారు. కొన్ని దుకాణాల్లో ఎరువు శ్యాంపిళ్లను సేకరించి నాణ్యతా పరీక్షల కోసం అగ్రిల్యాబ్‌కు పంపనున్నట్టు తెలిపారు. అగ్రికల్చర్ ఏడీ ధనుంజయరెడ్డి, విజిలెన్స్ సీఐ రవి, స్థానిక ఏవో సంధ్య పాల్గొన్నారు.

కాణిపాకంలో బహిరంగ వేలం

కాణిపాకం: కాణిపాక శ్రీవరసిద్ధి వినాయకస్వామి ఆలయానికి సంబంధించిన పలు నిర్వహణలకు మంగళవారం సీల్డ్ టెండర్లు, ఆన్‌లైన్ టెండర్లకు బహిరంగ వేలం నిర్వహించారు. తలనీలాలు పోగు చేసుకునేందుకు రూ.71 లక్షలు, కల్యాణ కట్ట ఎదురుగా బంకు నిర్వహణకు రూ.5,00,200 లక్షలు, శివాలయం, ఆలయ పరిసరాల్లో ఫొటోలు తీసుకునే లైసెన్స్‌కు రూ.5.25 లక్షలు, మొత్తం రూ.81,25,200ల ఆదాయం వచ్చినట్లు ఈఓ పెంచల కిషోర్ పేర్కొన్నారు.

ఎస్సీల సమస్యలపై అలుపెరుగని పోరాటం



శ్యామ్‌సుందర్‌రాజు, వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ సంయుక్త కార్యదర్శి

పలమనేరు: వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు ఆ పార్టీ రాష్ట్ర ఎస్సీ సెల్ సంయుక్త కార్యదర్శిగా శ్యామ్‌సుందర్‌రాజు నియమితులైనట్టు ఆ పార్టీ కేంద్ర కార్యాలయం మంగళవారం ఓ ప్రకటనలో తెలిపింది. ఈ సందర్భంగా పలమనేరులో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని ఎస్సీల సమస్యలపై పోరాడుతామని చెప్పారు. వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ గెలుపే ధ్యేయంగా ముందుకెళతామన్నారు.

తహసీల్దార్ సంతకం ఫోర్జరీ

కార్వేటినగరం: ఏకంగా తహసీల్దార్ సంతకాన్నే ఫోర్జరీ చేసిన ఘటన మండలంలో కలకలం రేపుతోంది. దీనిపై తహసీల్దార్ నాగరాజు స్థానిక సీఐ హనుమంతప్పకు మంగళవారం ఫిర్యాదు చేశారు. అనంతరం తహసీల్దార్ మాట్లాడుతూ గ్రామ కంఠం ధ్రువపత్రాల కోసం మండలంలోని కొందరు వ్యక్తులు రెవెన్యూ అధికారుల సంతకాలను ఫోర్జరీ చేస్తున్నారని చెప్పారు. ఈ క్రమంలో టీకేఎంపేట గ్రామానికి చెందిన కుమారస్వామి తన ఇంటి స్థలం రిజిస్ట్రేషన్ చేసుకోవడానికి రెవెన్యూ అధికారుల నో అబ్జెక్షన్ సర్టిఫికెట్ పొందాల్సి ఉండగా.. కొందరు వాటిని నకిలీ సంతకాలు పెట్టి మంజూరు చేసినట్లు గుర్తించామన్నారు. ఈ మేరకు స్థానిక సీఐకి ఫిర్యాదు చేసినట్టు వెల్లడించారు.

రైతుల అంగీకారంతోనే భూసేకరణ



మాట్లాడుతున్న కార్మిక సంఘం నాయకుడు ఓబులరాజు

శాంతిపురం: కుప్పం విమానాశ్రయం కోసం రైతుల నుంచి బలవంతపు భూ సేకరణ చేయరాదని హైకోర్టు ప్రభుత్వానికి నిర్దేశించినట్టు వ్యవసాయ కార్మిక, రైతు సంఘం చిత్తూరు జిల్లా కార్యదర్శి ఓబులరాజు తెలిపారు. మంగళవారం ఆయన విమానాశ్రయ బాధిత రైతులతో కలిసి శాంతిపురంలో విలేకరులతో మాట్లాడారు. తప్పుడు నోటిఫికేషన్లతో ప్రభుత్వం నిర్బంధ భూ సేకరణకు పూనుకోవడంపై రైతులు హైకోర్టును ఆశ్రయించారన్నారు. విచారణ సందర్భంగా నోటిఫికేషన్లలోని లోపాలను ప్రభుత్వ న్యాయవాది కూడా అంగీకరించారన్నారు. అంగీకారం ఉన్న రైతుల నుంచి మాత్రమే తాము భూములు సేకరిస్తున్నామని తెలిపారని వెల్లడించారు. మిగతా రైతులకు భూ సేకరణ చట్టం 2013 ప్రకారం మరో నోటిఫికేషన్ ఇచ్చేందుకు ప్రభుత్వ న్యాయవాది సుముఖత వ్యక్తం చేయడంతో కోర్టు ఈ వ్యాజ్యాన్ని ముగించిందని చెప్పారు. రామకుప్పం, శాంతిపురం మండలాల పరిధిలో విమానాశ్రయం కోసం ఎంచుకున్న భూముల రైతులతో పాటు వారిపై ఆధారపడి జీవిస్తున్న దాదాపు 3,500 మంది వ్యవసాయ కూలీలకు కూడా ప్రభుత్వం న్యాయం చేయాలని ఆయన కోరారు.

రక్షణ కల్పించండి



ఆలయంలో వివాహం చేసుకుంటున్న ప్రేమికులు

రొంపిచెర్ల: 'ప్రేమించి పెళ్లి చేసున్నాం.. మాకు మా తల్లిదండ్రుల నుంచి రక్షణ కల్పించండి' అని నూతన వధువు మానస పోలీసులను వేడుకుంది. వివరాలు .. రొంపిచెర్ల మండలం, చెంచెంరెడ్డిగారిపల్లె పంచాయతీ, శ్రీరాముల వడ్డిపల్లెకు చెందిన చెంగల్‌రాయులు కుమార్తె మానస (22) తిరుపతిలోని మహిళా యూనివర్సిటీలో పీజీ ద్వితీయ సంవత్సరం చదువుతోంది. తిరుపతి జిల్లా, నారాయణవనం మండలం, వెత్తలతడుకు గ్రామానికి చెందిన ఎం.వెంకటేశ్వర్లు(27)తో రెండేళ్లుగా ఉన్న పరిచయం ప్రేమగా మారింది. కలికిరి రాముడు గుడిలో ఈనెల 12వ తేదీ వివాహం చేసుకున్నారు. అయితే తమకు పెద్దల నుంచి ప్రాణహాని ఉందని, రక్షణ కల్పించాలని కల్లూరు సీఐ సూర్యనారాయణను వేడుకున్నారు. మానస తల్లిదండ్రులను సీఐ విచారించి వారికి నచ్చజెప్పి ప్రేమికులను కలిపారు.

మిగిలిన ఉన్న గురుకుల సీట్లకు కౌన్సెలింగ్

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలోని డా.బీఆర్.అంబేడ్కర్ ఏపీఎస్‌డబ్ల్యూఆర్ గురుకులాల్లో మిగిలి ఉన్న సీట్లను భర్తీ చేసేందుకు ఈనెల 17న కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు జిల్లా కో-ఆర్డినేటర్ పద్మజ తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఆమె విలేకరులతో మాట్లాడారు. జిల్లాలోని 7 గురుకులాల్లో 2025-26 విద్యాసంవత్సరానికి పది, ఇంటర్మీడియెట్‌లో మిగిలి ఉన్న సీట్లను భర్తీ చేయనున్నట్లు చెప్పారు. ఇంగ్లిష్ మీడియంలో చదువుతున్న విద్యార్థినీవిద్యార్థినులకు ఈ నెల 17న నిర్వహించే కౌన్సెలింగ్‌ను సద్వినియోగం చేసుకోవాలన్నారు. జిల్లా కేంద్రంలోని ఉపాధి కార్యాలయంలో ఉన్న ఏపీఎస్‌డబ్ల్యూఆర్ శాఖలో కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు తెలిపారు.

అదుపు తప్పిన లారీ

– ఒకరి మృతి



మృతుడు అవనాక్షయ్య

పుత్తూరు: మండల పరిధిలోని పరమేశ్వరమంగళం గ్రామం వద్ద మంగళవారం ఓ లారీ అదుపు తప్పి పలు వాహనాలపైకి దూసుకెళ్లింది. ఈ ప్రమదంలో ఓ వ్యక్తి మృతిచెందాడు. పోలీసుల కథనం మేరకు.. తిరుపతి నుంచి చెన్నైకి వెళ్తున్న లారీ ఆగి ఉన్న స్కూటరిస్టు అయిన దిగువకనకంపాళెం గ్రామానికి చెందిన టి.అవనాక్షయ్య(55)ను ఢీ కొట్టింది. దీంతో అతను అక్కడికక్కడే మృతి చెందాడు. అనంతరం సమీప హోటల్ వద్ద ఆగి ఉన్న రెండు కార్లను ఢీకొట్టింది. ఓ కారులో కూర్చొని ఉన్న రాజు అనే వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రుడ్ని మెరుగైన వైద్యం కోసం తిరుపతి రుయాకు తరలించారు. లారీ డ్రైవర్‌ను అదుపులోకి తీసుకొని పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



కాలు ఇరుక్కుపోవడంతో ఇబ్బంది పడుతున్న పెన్షనర్



ప్రత్యేక కట్టర్‌తో గ్రిల్స్‌ను కట్ చేస్తున్న అగ్నిమాపక సిబ్బంది



పెన్షనర్ సూరిని సురక్షితంగా బయటకు తీస్తున్న అగ్నిమాపక సిబ్బంది

రీ'కాల్' చేయొద్దు!

కలెక్టరేట్ వద్ద ఉన్న ప్రధాన గేటుకు ఉన్న గ్రిల్స్ ప్రజలను ముప్పుతిప్పలు పెడుతోంది. సమస్యలు చెప్పుకుందామని వచ్చిన వారి కాళ్లు ఇరుక్కుపోయేలా చేస్తోంది. ఇలాంటిదే మంగళవారం చోటు చేసుకుంది. పెన్షనర్ల సంఘం నాయకులు సమస్యల పరిష్కారం నిమిత్తం కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాకు పలు శాఖల్లో పనిచేసి ఉద్యోగ విరమణ పొందిన పెన్షనర్లు హాజరయ్యారు. రిటైర్డ్ రీజనల్ ఉపాధి కల్పనా అధికారి సూరి కలెక్టరేట్‌లోనికి వస్తున్న సమయంలో గేటు వద్ద ఉన్న గ్రిల్స్‌లో కాలు ఇరుక్కుపోయింది. చాలాసేపు తన కాలును బయటకు తీసేందుకు ప్రయత్నించినా ఫలితం లేకుండా పోయింది. ఏమి చేయలేక అర్ధగంటకు పైగా అక్కడే కూర్చొని ఉండిపోయాడు. కాలును బయటకు తీసే ప్రయత్నంలో ఆ పెన్షనర్ నొప్పికి అల్లాడిపోయాడు. తీరా అగ్నిమాపక శాఖ సిబ్బంది ప్రత్యేక కట్టర్‌తో గ్రిల్ పైపు కట్టచేసి పెన్షనర్‌ను సురక్షితంగా బయటకు తీశారు. ఇలాంటి ఘటన పునరావృత్తం కాకుండా గ్రిల్స్‌ను సరిచేయాలని పలువురు కోరుతున్నారు. – చిత్తూరు కలెక్టరేట్